# చేతులు కాలాయి

పరా మ్మగారూ, తలుపుదగ్గర నించుని పిల్చాడు శంకరం.

"ఏం, నాయనా" ముసుగు సవరించు కుంటూ వచ్చింది సుందరమ్మ గారు.

"ఆస్పత్రికి వెళ్లొస్తాను. కాస్త పిల్లలని చూస్తారు గదూ. ఆడు కుంటున్నారు లెండి" అన్నాడు శంకరం.

"అలాగే, వెళ్ళిరా నాయనా, కాఫీ తీసు కెడుతున్నావా, వెళ్ళిరా చూస్తాలే" అంది ఆవిడ.

శంకరం వరండాలోంచి సైకిలు తీసుకుని బయలు దేరాడు. ఆఫీసు నించి ఆదరా బాదరా వచ్చి కాఫీ చేసుకుని త్రాగి, పిల్లల కింత పోసి, ఎడ పిల్లకి పాలుపట్టి అందరికీ మొహాలు కడిగి తనూ కడుక్కుని పెళ్ళానికి కాఫీ ఫ్లాస్కులో పోసుకుని ఆస్పత్రికి బయలుదేరాడు. అక్కడ భార్యను చూసి మళ్ళీ ఇంటికి వచ్చి వండాలి. పిల్లలను పడుకో బెట్టాలి. మళ్ళీ ప్రొద్దునే కాఫీలు, వంట, ఆఫీసు....తను చేయాల్సిన పనులన్నీ చెయ్యాల్లా ఎదుటనిలబడి భయ పెడ్తోంటే శంకరంకి అలసట నీర్సం ముంచుకు వచ్చింది. అప్పుడే రెండు రోజులయింది ఆస్పత్రిలో చేర్చి. ఇంకా కాన్పు అవలేదు. అయ్యాక ఇంకోవారం! చెయాల్సిన చాకిరీ కంటె నల్గురి పిల్ల లని, అందులో రెండేళ్ళ పిల్లని సంబాళించు కుంటూ వచ్చేసరికి శంకరం ఆ పది రోజులలో సగం అయిపోయాడు. ఏదో వెధవది మొగపిల్లాడు కావాలన్న ఆశ, కోరిక పీడిస్తూంటే ప్రలోభపడ్డాడు!.... ఫలితం నలుగురు ఆడపిల్లలు! పెళ్ళయిన తొమ్మిదేళ్ళలో యిది ఐదోకాన్పు! మూడో కాన్పు నించి భార్య ఆరోగ్యం దిగజారింది. నాలుగో కాన్పుకే డాక్టరు చివాట్లు

పెట్టింది. వంశోద్ధారకుడి కోసం ఆ చివాట్లని లక్ష్యపెట్టలేదు. ఐదోసారి నీవు మనిషివా, పశువ్వా అన్నట్లు చూసింది డాక్టరమ్మ. నలుగురిపిల్లలతో దాలీచాలని జీతంతో రెండు పురుళ్ళకి భార్య ఆస్పత్రిలో పడుంటే తను యింట్లో పడిన నరకం అన్నీ గుర్తుకొచ్చి అవునుసుమా, పొరపాటు చేశాను. అన్న పశ్చాత్తాపంతో పాటు యీ సారీ ఆడపిల్ల పుడితే ఏం చేసేట్టు అన్న భయం ఆరంభించాయి శంకరంలో. చేతులు కాలాయి కనక ఈ సారి యింక ఆకులు పట్టుకుని లాభం లేదని యింక చాలు బుద్ధివచ్చింది అని చెంపలేసుకున్నాడు శంకరం. నీలాంటి వాళ్ళకి చెప్పి లాభంలేదు. యీసారి ఆవిడకే ఆపరేషన్ చేసేస్తానని డాక్టరు తిరస్కారంగా అంటే తలవంచుకుని తలాడించాడు. దేముడు దయ ఎలావుందో యీసారి!.... మగపిల్లాడి మాట దేము డెరుగు సీత బొత్తిగా వంట్లో ప్రాణం లేకుండా వుంది. ఈ గండం గడిచి బయట పడితే చాలు... అనుకున్నాడు శంకరం.

ఆస్పత్రి వరండాలనిండా జనం! విజిటింగ్ టైముకనక రోగుల బంధువులతో, ఆప్తులతో, మిత్రులతో వార్డులన్నీ నిండి పోయాయి.

తెల్లటి ప్రక్కమీద అంతకంటె తెల్లగా పాలిపోయిన సీత మంచం దగ్గరికి వచ్చాడు శంకరం. భర్తని చూసి నీరసంగా నవ్వింది సీత. "ఎలా వుంది సీతా, డాక్ట రేమంది?" అన్నాడు ఆరాటంగా శంకరం.

"అలాగేవుంది, ఇంజక్షనిచ్చారు... అయితే ఈ రాత్రికి కాన్పు అవచ్చంటున్నారు.

"నెప్పులు అలాగే వున్నాయా?" శంకరం ప్రక్కమీద కూర్చుని, కాఫీ గ్లాసులోకిపోసి అందించాడు. "నిన్న రాత్రి కొద్దిగా ఓ రెండుగంటలు వచ్చి ఆగిపోయాయి. మళ్ళీ రాలేదు. ఏమిటో యీ నరకం ఎన్నాళ్లు అనుభవించాలో ఏమిటో" సీత నిరాశ నిస్పృహ బాధలతో అంది.

'డాక్టరు ఏమీ అనడం లేదూ?'

"ఏం అంటుంది. చూస్తున్నారు, నెప్పులు రావాలిగా, సమయం వచ్చే వరకు వాళ్ళుమాత్రం ఏం చేస్తారు. అవసరమయితే ఏ ఆపరేషన్ వాళ్లేచేస్తారు."

'ఊః.....బాగుంది. ఈసారి ఎందుకిలా అయిందో '

"ఖర్మ ! ఖర్మమాట ఎలావున్నా 'చేతులారా చేసుకున్నారు. తొమ్మిదేళ్ళలో ఐదు కాన్పులా! పోనీ మందులన్నా వేసుకోరు చెప్పినట్లు, వంట్లో రక్తంలేదు, బలంలేదు యిలా తయారవుతారు మా పీకల మీదకి. మేం ఏం చేయగలం' అంటూ మాటకి ముందు సాధిస్తుంది డాక్టరు. తలెత్తుకోలేక పోతున్నాను" అంది సీత, శంకరం తలొంచుకున్నాడు.

'సర్లెండి, యిప్పు దేమనుకుని యేం లాభం? పిల్ల లేమంటున్నారు, అల్లరిచేస్తున్నారా మిమ్మల్ని! ఏడిపిస్తున్నా రా'

"ఏడిపించడమా, వెధవలు నాప్రాణాలు తోడేస్తున్నారనుకో, చస్తున్నాను వాళ్ళతో, అందులో ఆ చంటి దాన్ని పట్టుకోడం నా వశం కావడం లేదు. నిన్న రాత్రంతా పడుకోనేలేదు. లేచినప్పుడెల్లా అమ్మా అంటూ యేడుపు, సముదాయించేసరికి నా ప్రాణంపోతుంది. ప్రతిసారి ఐదోరోజు యింటికి వచ్చేదానివి. కనీసం పిల్లలని చూసుకునే దానివి. ఈ సారి అప్పుడే రెండు రోజులైంది. కాన్పుఅవాలి, ఆపరేషన్ ఇవన్నీ అయి నీవు యింటికి వచ్చేసరికి నా చావు మూడుతుంది" ఓరాగ్గా అన్నాడు శంకరం. సీత నిట్టూర్చింది. 'చంటిపిల్లలు, జ్ఞానం తెలుసా ఏమన్నానా వాళ్ళకి. ఎలాగో పదిరోజులు యీ సారికి బాధపడాలి, మరేం చేస్తాం. మన ఖర్మ కాకపోతే యిటుఅటు కూడా ఆదుకునే వాళ్ళు లేకుండా అయ్యారు మనకి' అంది.

నిజమే, శంకరం తల్లి దండ్రులులేరు. అక్కగార్లున్నారు. వాళ్ళ నెవరినన్నా పిలిస్తే, వాళ్ళు అరడజను మంది పిల్లలతో వస్తే పోషించే స్తోమతలేని శంకరం ఆ అనుభవం ఒకసారి అయ్యాక అంతకంటే చాకిరీ చేసుకోడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు. సీత తల్లి వుందిగాని ఆవిడ రోగిష్టిది. ఆవిడకే అందరూ చెయ్యాలి. రెండు పురుళ్ళకి పుట్టింటి వారు తీసు కెళ్ళారు. తల్లి మంచాన పడ్డాక పుట్టింటి ఆశ పోయింది సీతకి.

డాక్టరు దూరంగా రావడం చూసి శంకరం లేచి నిల్చున్నాడు. అతనికి డాక్టరుని చూస్తే భయం, ఎక్కడ దులుపుతుందోనని, నమస్కారం చేశాడు. ఆవిడ ఓ చూపు శంకరం వైపు విసిరి 'ఎలా వుంది.... నెప్పు లేమన్నా వస్తున్నాయా....' అంటూ సీతని అడుగుతూ, పొట్ట నొక్కింది.... 'లేదండీ' అంది సీత, ఆవిడ నర్సుతో ఏమిటో చెప్పింది.

'చూద్దాం.... రేపటిలోగా రావచ్చు.' అంటూ ఆవిడ కదిలి ముందుకు వెళ్ళింది.

"ఇంటికెళ్ళండి... పిల్లలు ఏడుస్తున్నారో ఏమిటో... వంట అది చెయ్యాలి గాబోలు యింకా....నాకేం పరవాలేదులెండి .. బామ్మగారు కూర అది చేసియిస్తున్నారా...." సీత అడిగింది.

'ఊ... ఆవిడ వుండబట్టి యీపాటి అన్నా ఈడ్చుకు వస్తున్నాను. పాపం రెండు పూటలా కూరో పచ్చడో ఏదో ఇస్తూంది చేసి. పిల్లలని చూస్తూంది. ఆవిడ రుణం తీర్చుకోలేం మనం అన్నాడు శంకరం.

నిజమే! ప్రక్కవాటాలోని బామ్మగారు పెద్దదిక్కులా సీత వాళ్ళని కష్టంలో సుఖంలో ఆదుకుంటూంది. పురుటికి సీత ఆస్పత్రిలో వున్నన్ని రోజులూ పిల్లల్ని శంకరం ఆఫీసుకి వెళ్ళినపుడు చూస్తూంది. శంకరం అత్తెసరు పడేసుకుంటే ఏ కూరో పచ్చడో చేసి ఇస్తుంది. సీతకి పథ్యం

వంట వండి పెట్టుంది. ఆ పది రోజులూ, స్నానం చేసిందగ్గరినించి సీతే పనిమనిషి సాయంతో కుంపటిదగ్గిర కూర్చుని వండుకునేది.

శంకరం ఇంటికి వచ్చేసరికి చీకటి పడ్తూంది. సైకిలు పెట్టి గదిలోకి వెళ్ళేసరికి వళ్ళు తెలియని కోపం వచ్చేసింది. చంటిది ఉచ్చ పోసుకుని హాయిగా చేతులు తపతప కొట్టుకుంటూ మొహం వళ్ళూ తడుపుకుంటూంది. రెండో పిల్ల మూడోపిల్ల లక్క పిడతలకోసం హోరా హోరి దెబ్బలాడుకుంటూ జుట్టుపీక్కుంటూ కలబడుతూ ఏడుస్తున్నారు. పెద్దపిల్ల ఇవేం పట్టనట్టు పలకమీద ఏదో రాసుకుంటూంది. ఇల్లంతా కాగితాలు చింపి పోశారు. 'పాపా!' ఒక్క కేక పెట్టాడు శంకరం. పెద్దపిల్ల ఎనిమిదేళ్ళ పిల్ల తండ్రి గర్జనకి ఉలిక్కిపడి బిక్కమొహం వేసుకు చూస్తూండి పోయింది. "నీకేం చెప్పాను, చెల్లిని చూడమన్నానా? అది అలా వుచ్చ పోసుకు తడుపుకుంటూంది. వీళ్ళిలా కొట్టుకుంటున్నారు.... ఈ కాగితాలేమిటి, ఈ ఇల్లేమిటి.... ఏం చేస్తున్నావు! దరిద్రపు వెధవల్లారా, పిల్లలా మీరు రాక్షసులు గానీ" అంటూ పెద్దపిల్లని వీపుమీద దబదబ బాదాడు. కొట్టుకుంటున్న ఇద్దరి పిల్లలకి చెరొకటి తగిలించి దూరంగా కుదేశాడు. చంటిపిల్లని ఒంటి రెక్కతో లేవనెత్తి ఎత్తి కుదేశాడు. "దిష్టిబొమ్మలా ఏమిటే చూస్తున్నావు. గుడ్డ పట్టుకొచ్చి తుడు. చెల్లి బట్టలు మార్చు. ఒసేయ్ ఈ కాగితం ముక్కలు ఏరే...." అంటూ అరిచాడు. తండ్రి కోపానికి బిక్కచచ్చి పోయారు పిల్లలు. శంకరం కేకలకి బామ్మగారు యివతలికి వచ్చింది.

"ఏం నాయనా వచ్చావా! అమ్మాయి కెలావుంది! కాన్పు ఎప్పుడవుతుందంటున్నారు?" శంకరం అలసటగా కుర్చీలో కూర్చుంటూ "తెలీదండి, బహుశా రేపటిలోగా రావచ్చంటూంది డాక్టరు...." అన్నాడు.

'కాలం రావాలిగదా దేనికన్నా, బాధపడకు బాబూ.... పిల్లలు ఆకలంటూ ఏడుస్తున్నారు.... త్వరగా బియ్యం పడెయ్యి నాయనా.... ఇంత తిని పడుంటారు' అంది బామ్మగారు.

నీరసంగా లేచి బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని వంటింట్లోకి వెళ్ళాడు శంకరం. 'ఏమిటో పిచ్చి బ్రాహ్మడు.... మొగపిల్లాడు మొగ పిల్లాడు అనుకుంటూ నలుగురు ఆడపిల్లల్ని కన్నాడు. ఈ సారన్నా కొడుకు పుడ్తాడో లేదో.... అమ్మాయి ఆరోగ్యం అలావుంది... యీ నలుగురిని పెంచేదెలా, పెళ్ళిళ్ళు ఏం చేస్తాడో.... ఏమిటో కొడుకు కొడుకు అను కోడంతప్ప.... వాళ్ళేం నెత్తికెక్కిస్తారు' బామ్మగారు పచ్చడి రుబ్బుతూ శంకరం గురించి ఆలోచిస్తూ జాలిపడింది.

• • •

"ఒరేయ్.... ఎందుకురా నన్నిలా కాల్చుకు తింటావు. పది తే ఇరవైతే అంటే ఆ స్తమాను ఎక్కడ తెచ్చి ఇస్తారా! ఇక్కడ డబ్బు మూటకట్టు కూర్చున్నానురా...." బామ్మగారు గొంతు విసుగ్గా, బాధగా వినిపిస్తూంది.

పిల్లలకి అన్నాలు పెట్టి, తను తింటున్న శంకరం బామ్మగారి మాటలు విని ఆ అంజి మళ్ళీ డబ్బుకి ఆవిడ్ని కాల్చుకు తింటున్నాడులా వుంది పాపం అనుకున్నాడు.

"నా క్కావాలి. ఇస్తావా లేదా చెప్పు, అడగ్గానే ఎప్పుడు ఇచ్చావులే.... ఎప్పుడడిగినా లేదులేదు అంటూ ఏడుస్తూనే వుంటావు."

హు .. తల్లిని కొడుకు అంటున్న మాటలు! వింటున్న శంకరం వళ్ళు మండుకొచ్చింది. అప్రాచ్యుడు. ఆవిడ కడుపున చెడబుట్టాడు. పాపం ఆవిడెలా భరిస్తూందో! ఏం చేస్తుంది భరించక, కన్నాక! పాపం ఇద్దరాడ పిల్లల తర్వాత లేకలేక నలభయ్యో పడిలో పుట్టాడట! అల్లారుముద్దుగా అపురూపంగా పెంచినందుకు ఆవిడకి ఇదీ శిక్ష! మొగుడు పోయిందగ్గిర

నించీ ఆ వున్న కాస్త భూమితో, ఇల్లద్దెకిచ్చి ఆ డబ్బుతో సంసారం లాక్కొస్తూ కొడుకుని చదివించుకుంటూంది. ఇద్దరాడపిల్లలకీ తండ్రి వుండగానే పెళ్ళి చేశాడు. వాళ్ళు సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు. ఎటొచ్చీ యీ ఆంజనేయ వరప్రసాదు, వరప్రసాదంలా పుట్టాడన్న కొడుకు ఈనాడు ఆవిడ నెత్తిన పిండి కొడుతున్నాడు. పాతికేళ్ళొస్తున్నా ఆ బి. ఏ. చదువు ఎప్పటికీ పూర్తి చేయకుండా, అలా ఒక్కొక్క క్లాసులో డింకీలు కొడుతూ యింకా అలా చదువుతూనే వున్నాడు. సినిమాలు, సిగరెట్లు, స్నేహితులు, పేకాట సకల గుణాభిరాముడు! రెండు రోజులకోసారి పదియ్యి పదిహేనుయియ్యి అంటూ తల్లి ప్రాణాలు కొరుక్కుతింటూ కాల్చుకు తింటాడు. డబ్బిచ్చేవరకూ సాధిస్తాడు. నోటికొచ్చినట్టు మాట్లాడుతాడు. తిడ్తాడు. ఆ పోరు పడలేక వున్నప్పుడు ఆవిడ యిచ్చేస్తుంది. డబ్బు లేనప్పుడు లేదురా నాయనా అంటూ బ్రతిమిలాడ్తుంది. నచ్చచెబుతుంది. ఏడుస్తుంది. డబ్బియకపోతే కొడుకు అలిగి అన్నం ముట్టుకోడు, ఇంటికి రాడు అని ఆవిడకి భయం. ఇంట్లోనే వుండి తల్లి ఎదుటే పచ్చి మంచినీళ్ళన్నా ముట్టుకోకుండా ఉపవాసం వుండి ఆవిడ్ని హింస పెడ్తాడు. ఆపద చూడలేక, భరించలేక ఆఖరికి ఆ డబ్బు అప్పన్నా చేసి తెచ్చి యిస్తుంది కొడుక్కి.

ఇంట్లో ఈ భాగోతం అంతా శంకరానికి క్రొత్త కాదు. అంజి అంటే అతనికి మంట చదువు సంధ్యా లేకుండా జులాయిలా తిరిగే అతన్ని చూస్తే. కన్నతల్లి కాబట్టి ఆవిడ భరిస్తూంది, మరొకరయితేనా అనుకుంటాడు కోపంగా. అలాంటి సమయాలలోనే అతనికి కొడుకు, కొడుకు వంశోద్ధారకుడు కావాలన్న అతని కోరిక గుర్తువస్తుంది. వళ్ళు ఝల్లుమంటుంది. కొడుకు .... ఇలాంటి కొడుకుకోసమా తనింత కలవరిస్తున్నాడు! పోనీ అందరూ అంజి అంత దుర్మార్గులు కాక పోయినా యీ రోజుల్లో ఏ కొడుకులు తల్లి తండ్రులకి చేస్తున్నది ఏముంది? ఎవరిదాకానో ఎందుకు?

తను తన తల్లి తండ్రులకి ఏం చెయ్యగలిగాడు? పట్టుమని పది రూపాయలు ఏ నాడన్నా పంపగాలిగాడా? రోగ మొచ్చినప్పుడైనా నాలుగు రోజులుండి సేవచేయగలిగాడా? ఆఖరికి చచ్చిపోయే ముందు ఆయన కలవరించినా ఆఖరి చూపన్నా ఆయనకి అందచేసాడా? అంతే ఈ రోజుల్లో ఎవరికీ వారే! ఎవరి సంసారాలు, ఎవరి బరువులు బాధ్యతలు వాళ్ళవే! కనడం పెంచడం వరకే తప్ప పిల్లలనించి ఏమీ ఆశించే రోజులు పోయాయి! ఆమాత్రం దాని కోసం తనెందు కింక కొడుకుకోసం కలవరించడం! కొడుకుకోసం అనవసరంగా నలుగురు పిల్లలని కని మోయలేని భారం పెంచుకున్నాడు! అలాంటప్పుడు పడే పశ్చాత్తాపం శంకరం అప్పుడే మరిచి పోయేవాడు. ఫలితమే ఐహో కాన్పు భార్యకి.

"అన్నం తిని వెళ్ళరా నాయనా, సన్నిలా కొల్చుకు తినకురా, అన్నం వండేశాను రెండు ముద్దలు తినిపోరా" ఆవిడ కొడుకుని దీనంగా బ్రతిమిలాడుతూంది.

"నీ వెధవ భోజనం నాకేం అక్కర్లేదు. ముందు నాకు డబ్బిస్తావా లేదా! నే వెళ్ళి టిక్కట్లు కొనుక్కోవాలి" ఆ రోజే విడుదలయిన సినిమాకి రెండో ఆటకి టిక్కట్లు దొరకవేమోనని అంజి బెంగ. స్నేహితులముందెంత తలవంపు డబ్బు లేదంటే!

'వరేయ్ నీ యిష్టం. నేనింక నీకు చెప్పలేను నాయనా, తింటే తిను లేకపోతే పో....నాదగ్గిర డబ్బు మాత్రం లేదు. నే నీయను....' ఆవిడ దృఢంగానే అంది.

'డబ్బు లేదూ.... వెధవ అబద్ధాలు నీవూనూ....మధ్యాహ్నం రైతు డబ్బు తీసికొచ్చి యిాయడం నే చూడలే దనుకున్నారా?'

'నీ కంట పడిందీ ఆ డబ్బు....అవునురా ఇచ్చాడు ... ఆ డబ్బు

రెండు రోజులలో అర్పేస్తే తర్వాత నోట్లోకి వేళ్లెలా పోతాయిరా! ఆడ ముండని నేనిక్కడంచి తెచ్చి నిన్ను పోషిస్తానురా! పాతికేళ్ళొచ్చాయి, ఆ చదువు పూర్తిచేసి కన్నతల్లిని సుఖపెడదామన్న ఆలోచన లేకపోగా, డబ్బుకి నన్నిలా కొట్టుకు తింటున్నావు. ఆ మహారాజు నన్నీ చావు చావ మని ఆయనదారి ఆయన చూసుకున్నారు ... నీవు నన్నిలా కాల్చుకు తింటు న్నావు. ఎప్పుడొస్తుందో నాకు చావు" ఆవిడ ఏడుస్తూంది.

'ఛా... నీవు కాదు నేను చావాలి. వెధవ బ్రతుకు ఒక్క సినిమాకు వెళ్ళడానికి యింత రాద్ధాంతం ఎప్పుడూ యింట్లో ...'

'సినిమాకి కావాలంటే రూపాయో రెండోగాని పదిహేను, ఇరవై ఎందుకురా!' పాపం బామ్మగారు అర్ధ రూపాయి టిక్కట్టుకి వెళ్ళినట్టు బి ఏ. చదువుకుంటున్న కొడుకు వెళ్ళడని, పక్కింటి సుబ్బమ్మగారితో వెళ్ళినా ఎవరి టిక్కట్టు డబ్బులు వాళ్ళు పెట్టుకోడం, నలుగురూ కలిసి వెళ్ళినప్పుడు ఎటికేట్ కాదని పాపం బామ్మగారి కేంతెల్సు! నలుగురు ఫ్రెండ్సు వెళ్ళాలి! టిక్కట్లు దొరక్కపోతే బ్లాకులోనన్నా కొనుక్కోవాలి. కాఫీ, టీ, కూల్ డ్రింక్స్, పాన్, సిగరెట్ల చిల్లర ఖర్చులు వుంటాయని ఎంతకని చెప్తాడు అంజి. అంతేకాక రెండో ఆటకి వెళ్ళేలోపల వీలయితే ఓ నాలుగు రౌండ్లు రమ్మీ ఆడుకోడానికి డబ్బుండాలి అని అన్ని ఖర్చులు ముసలావిడకి చెప్పడం చిరాకు గదా అంజిలాటి వాళ్ళకి!

'ఇంద' రెండు రూపాయలు తీసుకో, సినిమాకు వెడుదూవులే ముందు అన్నంతిను—

'నీ బోడి రెండు రూపాయలు నీవే వుంచుకో.... డబ్బు ఎలా తీసు కోవాలో నాకూ తెల్సులే....' అంజి దూకుడుగా అన్నాడు.

"ఒరేయ్ ... ఒరేయ్ ... అన్నం...." ఆవిడ అరుస్తూంది కొడుకు అన్నం తినకుండా వెళ్ళి పోతున్నాడని.

'హ....' నిట్టూర్చాడు శంకరం.

'ఏం పాపం చేసుకుని కన్నానురా నాయనా నిన్ను.... పూజలు చేసి చేసి నిన్ను కన్నాను' బామ్మగారు ఏడుస్తూ గొణుక్కోవడం విన్పించింది శంకరంకి. కొడుకు అన్నం తినలేదని ఆ పూట ఆవిడా తినకుండా పడుకుంటుందని శంకరంకి తెలుసు.

అర్ధరాత్రి నుంచి నిద్రలో వున్న శంకరంకి బామ్మగారు వెర్రి కేకలు పెట్టడం విని మెళుకువ వచ్చింది 'దొంగ.... దొంగ ...' ఆవిడ కేకలు విని గాభరాగా శంకరం తలుపులు తీసుకుని బయటికి వచ్చాడు. వస్తూంటే వరండాలోంచి చీకట్లో డాష్ యిచ్చిన మనిషిని గట్టిగా వాటేసుకున్నాడు శంకరం. శంకరాన్ని విడలించుకుని, గింజుకుని విసురుగా పారిపోతున్న మనిషి అంజి అని ఆ చీకట్లో కూడా గుర్తు పట్టగలిగాడు శంకరం. 'అంజీ!' అన్నాడాశ్చర్యంగా శంకరం, చేయి వదులు చేసి. ఆ అదునులో అంజి పారిపోయాడు. గబగబ లోపలికెళ్ళాడు. శంకరం లైటు వేసి చూసే సరికి బామ్మగారు బోర్లా నేలమీద పడివుంది.... 'బామ్మగారు' అంటూ శంకరం ఆత్రుతగా ఆవిడ దగ్గిర కెళ్ళాడు. ఆవిడ తెలివి తప్పి పడివుంది. నీళ్ళు తెచ్చి చల్లాక ఆవిడ కళ్ళువిప్పి, 'దొంగ దొంగ' వగరుస్తూ నోటమాట రానట్టు గజగజ లాడింది. శంకరంకి తెరిచిన పెట్టె అందులోంచి లాగి అడ్డదిడ్డంగా పడున్న బట్టలు కనిపించాయి. 'దొంగ పారిపోయాడా నాయనా ఆ పెట్టె చూడు బాబూ, డబ్బు పట్టుకు పోయాడో ఏమిటో' ఏడుపు గొంతుతో అందావిడ. ఆవిడ నుదుట పెద్ద బొప్పి కట్టింది. మోకాలు మోచేయి గీసుకుని నెత్తురు వస్తూంది. శంకరం ఆవిడని లేపి మంచంమీద కూర్చో పెట్టాడు. ఆవిడ కుంటుతూ లేచింది. శంకరం ఆరాటంగా పెట్టె చూశాడు. "డబ్బు లేదు బామ్మగారు."

'అయ్యయ్యో ఐదొందలు మధ్యాహ్నమే పెట్టాను నాయనా! దిక్కుమాలిన వాడు ఆ అంజిగాడు అలిగి పోయాడు ఇంట్లోంచి. ఎప్పుడొస్తాడో

ఏమిటో నని తలుపులు చేరేసి అలా నడుం వాల్చాను. వీధి తలుపు వేసే వుంది గదా లోపలి కెవరొస్తా రనుకున్నాను. అలా ఎప్పుడు నిద్ర పట్టేసిందో పెట్టె చప్పుడయితే మెలుకువ వచ్చి కళ్ళువిప్పి చూద్దును, ఎవడో పెట్టె తీస్తున్నాడు. గబుక్కున కేక పెట్టి లేచేసరికి మాయాదారి వెధవ ఒక్క తోపు తోసాడు. మంచం తగిలి బోర్లా పడ్డాను. నుదురు కొట్టుకుని కళ్ళు చీకటి కమ్మింది. అయ్యోయ్యో ఐదువందల రూపాయలు! నే నేం చెయ్యను! అయ్యో మరో నాలు గైదు నెలలు ఏం పెట్టుక తింటాం! వీడమ్మ కడుపు మాడా! ...' బామ్మగారు ఏడుస్తూ చెప్తూంది.

'వెర్రినాయన అడిగితే పది రూపాయలు ఇచ్చాను గాదు. యీ దొంగ వచ్చినాడి మొహాన కొట్టాను డబ్బంతా.'

ఆవిడ అమాయకత్వానికి జాలిపడ్తూ, పోయిన డబ్బు ఎలాగో పోయింది, ఆవిడ మనశ్శాంతిని కూడా పోగొట్టడం ఎందుకని తనకు తెల్సిన నిజం చెప్పలేక పోయాడు శంకరం.

'ఏం ఏంచేస్తాం యీ రోజు మంచిది గాదు బామ్మగారు! అయినా మీరు డబ్బు అలా పెట్టెలో అందరికీ తెలిసే చోటున యిక ముందన్నా పెట్టకండి. ఏ వంటింట్లో అరమార్లలో ఏవరికి తెలియని చోటున పెడ్తూం డండి' అన్నాడు శంకరం అంజిని దృష్టిలో వుంచుకుని. ఆవిడ ముక్కు చీదుతుంది. తరువాత చాలా సేపు నిద్ర పట్టలేదు శంకరానికి వచ్చి పడుకున్నాక—

* * *

ఉదయం లేచే సరికి బారెడు ప్రొద్దెక్కింది. ఆలస్యమై పోయిందని అదరా బాదరా పనులు చేసి వంటచేసి భార్యకి క్యారేజీ పట్టుకుని ఆస్పత్రికి బయలు దేరాడు శంకరం. అట్నించి వచ్చి పిల్లలకి పెట్టి తను తిని ఆఫీసు కెళ్ళాలి. సీతకి ఎలావుందో! పురుడు వచ్చిందేమో! ఏదన్నా చికాకయితే

ఫోను చెయ్యమని రెండిళ్ళ అవతల వున్న ప్లీడరుగారి ఫోను నంబ రిచ్చాడు శంకరం ఆస్పత్రిలో నర్సుకి. ఫోను ఏం రాలేదు. పాపం ఒక స్త్రీ ఎలావుందో!

ఆస్పత్రి కెళ్ళేసరికి సీత పడుకున్న తెల్లటి ప్రక్క ఖాళీగా వుంది. ఒక క్షణం శంకరం గుండె ఆగిపోయింది. కాళ్ళలోంచి వణుకు పుట్టింది, సీత! .... సీతేమయింది?

'ఏమండి, యీ బెడ్డుమీద ఆవిడ....' మాట పూర్తి చెయ్యలేక పోయాడు శంకరం చెమటలు పట్టాయి.

"తెలీదండీ"! అంది ఆవిడ 'నేను ఇందాకనే జాయిన్ అయ్యాను' అంది మళ్ళీ. రెండు మంచాల తరువాత వున్న ఆవిడ శంకరం గాభరా చూచి 'ఆవిడ్ని రాత్రి రెండు గంటలప్పుడు లేబర్ రూముకి తీసి కెళ్ళారండీ, కాన్పు అయినట్లులేదు, ఆపరేషన్ అంటూ హడావిడి పడ్తున్నారట. నర్సు అంది ఇందాక పాపం రాత్రి పదిగంటల నించి చాల బాధ పడ్తున్నారు....'

సీత ఇంకా బ్రతికే వున్నదన్న కబురుకి శంకరంకి మళ్ళీ కాళ్ళు చేతులు ఆడడం మొదలు పెట్టాయి, తన పిచ్చి కాకపోతే ఏం జరిగినా తనకి తెలియకుండా ఏంచేసెయ్యరు గదా మనిషిని!

సీత! .... సీత కెలావుందో! ఎవర్నడగడం! మంచాలన్నీ దాటుకుని డ్యూటీ రూము దగ్గిర కెళ్ళాడు. అక్కడెవరూ లేరు. వరండా చివర్నించి ఓ నర్సు నడుచుకుంటూ వస్తూంది. ఆరాటంగా ముందు కెళ్ళి 'పదకొండో' నంబరు పేషంటుకి ఎలా వుందండీ!' ఎవడీ వింత మృగం అన్నటు ఓ చూపు విసిరి 'నాకు తెలీదు' అంటూ విసురుగా వెళ్ళిపోయింది. తనకు తెల్సిన నర్సు మొఖాలు ఎక్కడన్నా కనిపిస్తా యేమోనని ఆశగా ఆరాటంగా చూశాడు. మరో నర్సు వస్తూంటే "ప్లీజ్... ఏమండీ, యిక్కడ పదకొండో నంబర్ బెడ్ పేషంటు కెలా వుందో చెప్పగలరా? కాన్పు అయిందా? ఆప రేషన్ చేస్తున్నారా? "ఆ నర్సు ఓ క్షణం ఆగి, "నాకు తెలీదండీ, నా డ్యూటీ కాదు ఇంకెవరినైనా అడగండి' అంది.

"ఫోసీ లేబర్ రూము ఎక్కడంటి," 'అలా కుడివైపు తిరిగి నడిచి మళ్ళీ ఎడంవైపు తిరగండి.' అంటూ వెళ్ళి పోయింది.

నర్సు చెప్పిన కుడి ఎడమలు చూసుకుంటూ లేబర్ రూమ్ చేరాడు. అక్కడ బెంచీల మీద కూర్చున్న పేషంట్ల తాలూకు బంధువులు ఆడ, మగ తప్ప నర్సులు, డాక్టర్లు ఎవరూ కనపడ లేదు. ఎవర్నడగడం? ఆరాటం, గాభరా, ఆందోళనతో చెమటలు పట్టేస్తున్నాయి శంకరంకి. ఓ ఐదు నిముషాలు ఇటు అటు తచ్చాడాక లోపల్నించి ఓ నర్సు ఏదో సామానులు పట్టు కొస్తుంటే గభాలున ముందు కెళ్ళి మళ్ళీ ఆరాటంగా సీత గురించి అడిగాడు.

"పదకొండో నెంబరా,....ఇక్కడెవరూ లేనట్టున్నారే! వుండండి అడిగి వస్తాను. పేరేమిటి? రెండు కాన్పు లవుతున్నాయి, చూసొస్తాను" అంది నర్సు. 'అమ్మయ్య ఈ మాత్రం జాలి దలచింది, అంతే చాలు' అనుకున్నాడు.

'సారీ, ఆ పేషంటు ఇక్కడ లేరండీ' శంకరం తెల్లపోతూ అయోమయంగా 'మరే మయిందండీ, లేబర్ రూముకి తీసి కెళ్ళారన్నారు కూడా' అతని అవస్థ వర్ణనాతీతం! కబురేమిటో తెలుసుకో లేక అసలే మయిందో తెలియక అతను గిజగిజ లాడాడు.

"తెలియదండి. నేను డే డ్యూటి నర్సుని, ఇందాకే వచ్చాను...."

'అమ్మా ప్లీజ్ కాస్త వివరం కనుక్కొని చెప్పారంటే మీ మేలు మరవను. అక్కడెవరో అన్నారు ఆపరేషన్ చేయాలిట అని"

"ఆపరేషన్ చేయ్యా లన్నారా అయితే థియేటరుకి తీసు కెళ్ళారేమో వుండండి లోపల అడుగుతాను" మళ్ళీ వెళ్ళింది నర్సు.

"ఆపరేషన్ థియేటరుకి తీసి కెళ్ళారుటండి, కేస్ కాంప్లికేటెడ్‌గా వుందట. అక్కడ కెళ్ళి అడగండి" అంది. శంకరం మళ్ళీ ఉరుకులు పరుగు

లతో నర్సు చెప్పిన కుడి ఎడమల వరుసన దాటి థియేటర్ చేరాడు. మరోసారి అక్కడ నర్సు కోసం ఆరాటంగా చూడడం, ఎవరూ కనపడక పోవడం, కనపడిన వాళ్ళు మాకు తెలియదనడం, నిముషాలు గడిచిపోతూ అసలు సంగతేమిటో కూడా తెలియకుండా శంకరం పడ్డ అవస్థ వర్ణనాతీతం. శంకరానికి భోరున ఏడుపు వస్తూంది, అవతల భార్య బాధ అటుంచి యీ అవస్థలకి అతనికి నిస్సహాయంతో దుఃఖం ముంచుకు వస్తూంది. రామచంద్ర ప్రభో పగ వాళ్ళ కన్నా వద్దు యీ ఆస్పత్రిబాధలు! రెండు పురుళ్ళకి నవ్యంగా పురుడవడం అదీ రాత్రి కాన్పు అయి తెల్లారి తను ఆస్పత్రి కొచ్చేసరికి తల్లి బిడ్డలు క్షేమంగా కనపడడంతో అవస్థ, ఆరాటం తెలీలేదు. సీతా సీతా ఏమయ్యావు? బ్రతికున్నావా అనుకుంటూ కళ్ళ వత్తు కున్నాడు. ఇంక నిలబడడానికి ఓపిక లేనట్టు అక్కడున్న బెంచిమీద చతికిలబడి పోయాడు. అప్పుడే ముప్పావు గంట అయింది. ఆస్పత్రి కొచ్చి ఇప్పటి వరకు అసలు భార్య స్థితి ఎలావుందో తెలియలేదు. ఆపరేషన్ చేశారా! సీత బతికిందా, పిల్ల చచ్చి పోయిందా? సీతా చచ్చిపోయిందేమో! తెల్లగుడ్డ కప్పి సినిమాలలో మాదిరి స్ట్రెచ్చర్ మీద తీసుకొస్తున్నట్టు, తను భోరున ఏడవడం, సీతా నిన్ను నేనే చంపేశాను. చేతులారా చంపేశాను అంటూ జుట్టుపీక్కోవడం ఇంట్లో పిల్లలు తల్లి లేని పిల్లలు తను చెయ్యాల్సిన చాకిరీ పిల్లలని పెంచ లేక పడే అవస్థలు సినిమా రీలులా గిర్రున కళ్ళముందు తిరిగి పోతు న్నాయి. మరో రీలులో సీత చచ్చిపోయిందే. పిల్లాడు బ్రతికాడు మీ కోరిక తీర్చాగా అంటూన్న సీత. ఆ కొడుకు అంజి మొహంతో భీకరంగా కనపడి వికటాట్టహాసం చేస్తూ డబ్బు తే డబ్బు తే అంటున్నాడు తనని నాలుగు తగలనిచ్చి తాళాలులాక్కుని పెట్లోంచి డబ్బులాక్కు పోతున్న కొడుకు. శంకరం కూర్చుని వున్నా తనున్న స్థితి ఏమిటో తనకే తెలియని స్థితిలో కళ్ళమ్మట కారుతున్న నీరుతో అలా ఎంతో సేపు కూర్చున్నాడు! ఆ కొద్ది నిమిషాలలో తనని తాను వందసార్లు తిట్టు కొన్నాడు. మనసులోనే లెంపలు

ఫెడీ ఫెడీ మని వాయింపేసు కున్నాడు. 'కొడుకూ వద్దు ఏమివద్దు భార్యని రక్షించు దేముడా' అంటూ వెయ్యిసార్లు ప్రార్థించాడు.

ఆపరేషన్ థియేటరు తలుపు తెరుచుకొని ఓ నర్సు బయటికి వచ్చింది. ఒక్క ఉదుటున ముందు కెళ్ళాడు శంకరం..... "సీత....సీత పదకొండో నెంబర్ బెడ్డు ఆవిడ' శంకరంకి అంతకంటె మాటలురాలేదు. నర్సు ఎగాదిగా చూసి 'పదకొండో పేషెంటు తాలుకా మీరు?' అంది.

'అమ్మయ్య' అనుకుంటూ గబ గబ తలాడించాడు.

"ఇప్పుడా వస్తారు? ఆవిడకి ఎంతో సీరియస్ అయింది. ఆపరేషన్ చెయ్యాలి బ్రతుకుతుందో లేదో పేషెంటు తాలూకు మనిషి ఎవరా అని చూస్తే ఎవరూ లేరు. ఇప్పుడా వస్తారు—?" అంది కోపంగా.

"నాకు తెలియదండీ అవసరమయితే ఫోను చెయ్యమని నెంబరిచ్చాను"

"ఆ నర్సు రెండుసార్లు ఫోనుచేసింది. అటునించి నోరి ప్లయ్"

'నేనేం చెయ్యాలండీ, తెలీదండీ..ఎలా ఉందండీ'ఆరాటంగా అడిగాడు.

ఈ లోపల డాక్టరమ్మ తొంగిచూసింది. శంకరాన్ని చూస్తూనే కోపంగా యువతలకి వచ్చి, 'ఏమండీ, పెళ్ళాం బ్రతికుందో లేదోనని చూడ్డానికి వచ్చారా ఏమిటి యిప్పుడు .... ఏం మనుషులండీ, ....కడుపు చేయటం ... రాత్రినించి ఆవిడ బాధపడ్తూంది....తెల్లారు ఝామునించి సీరియస్ అయింది. ఆపరేషన్ చెయ్యాలి. బ్రతుకుతుందో లేదోననే సీరియస్ స్థితిలో వున్న మనిషి తాలూకు వాళ్ళు ఇంతవరకు ఊడిపడక పోతే ఎలాగండీ....' ఆవిడ వరస పెట్టి దులిపేస్తూంది

'అమ్మా, తల్లీ మీకో నమస్కారం. నా భార్య బ్రతికుందో లేదో చెప్పి మరీ తిట్టు తల్లీ' అనుకున్నాడు శంకరం. కాని ఆ మాట పైకి అనే ధైర్యం లేదు.

'ఏమయిందండీ,....' ఏడుపు గొంతుతో అడిగాడు.

'ఏమవుతుందీ, వంట్లో బలం, రక్తం లేక పోయాక! ఏడాదికో బిడ్డ చొప్పున కంటూవుంటే ఇంకేమవుతుంది."

పాలిపోయిన మొహంతో గజగజ వణుకుతున్న శంకరం స్థితిని చూసి ఆవిడకే జాలి పుట్టి నట్టుంది. అక్కడితో ఆగింది. 'పెద్ద ప్రాణాన్ని అతి కష్టం మీద బ్రతికించాం. మీరు కావాలను కున్న కొడుకు మాత్రం దక్కలేదు.' అంది డాక్టరు సీరియస్‌గా ముఖం పెట్టి.

తుఫాను వెలిసిన ప్రశాంతిలా, మండు టెండలోంచి వచ్చి చల్లని నీరు త్రాగినంత హాయిగా అన్పించింది శంకరానికి ఆ క్షణం.

ఏ కొడుకుకోసం కలవరించి కలవరించి నలుగురి పిల్లలని కని బ్రతుకు భారం పెంచుకున్నాడో ఆ కొడుకు పుట్ట కుండానే చచ్చిపోతే ఏడవకపోవడమే గాక ఏదో రిలీఫ్ దొరికినవాడిలా 'సీతా ఎలా వుంది యిప్పుడు,' అంటూ సాయంత్రం అడుగుతున్న భర్తని, భర్త మొఖం మీద విరిసిన ప్రశాంతతని చూ ి విస్తు పోయింది సీత.

"మనం దురదృష్టవంతులం ... ఇంత కష్టపడ్డా ఫలం దక్కలేదు...." అంది సీత కళ్ళ నీళ్ళతో.

"మనం అదృష్టవంతులమే సీతా, ఎప్పటి నరకం సంగతో అప్పుడు చూసుకోవచ్చు గాని ముందు యిప్పటి నరకంనించి తప్పించుకున్నాం.... నీవు బ్రతికావు అంతే చాలు" అతనికి నిజంగానే ఆనందంగా వుంది. కొనాల్సిన పాల డబ్బాలు, మందులు, మరో ప్రాణి తిండి ఖర్చు తగ్గి నందుకు. అతని విచారమల్లా ఈ తెలివి తేటలు ఏ మూడోసారి వుంటే, ఎంత బాగుండేది అని!

(జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక 72)